10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

ఆదివారం 9 ఫిబ్రవరి 2025 పేజీలు 8

# చెల్లి ఢిల్లీలో కాలు పెట్టింది.. కేజ్రీవాల్ కొంపముంచింది

హైదరాబాద్ పెన్ పవర్:ఖలిక్కర్ స్కామే కేజ్రీవాల్ కొంపముంచిందన్నారు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు. గల్లీలో లిక్కర్ వ్యాపారం చేసుకోమంటే చెల్లి కవిత ఢిల్లీకి పోయింది.. చెల్లి ఢిల్లీలో కాలు పెడితే ఏమైందే ఇవాళ్టి ఫలితాలు నిరూపించాయని సెటైర్ వేశారు. అవినీతికి వ్యతిరేకంగా అన్నాహజారే పోరాటం చేస్తే.. ఆయన శిబిరం నుంచి వచ్చిన కేజ్రీవాల్ పార్టీ పెట్టాడని చెప్పారు. ఇప్పుడు అదే అవినీతి కేజ్రీవాల్ కొంప ముంచిందన్నారు. లిక్కర్ స్కాం తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని, అక్కడ కేజ్రీవాల్ పార్టీని ముంచిందన్నారు. లిక్కర్ స్కాంలో ఢిల్లీ సీఎం, ఉపముఖ్యమంత్రి, మంత్రులంతా అవినీతిలో కూరుకుపోవడం వల్లే ఆప్ ఓడిపోయిందని మండిపడ్డారు.మీడియాతో మాట్లాడిన రఘునందన్ రావు.. మార్పు తేస్తామంటే కాంగ్రెస్ ను నమ్మి అధికారంలోకి తెచ్చిన వాళ్లంతా ఇప్పుడు ఆలోచించాలి. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు కూడా రేవంత్ రెడ్డి చెల్లించడం లేదు. తెలంగాణలో సీఎం కుర్చీని ఎవరు లాక్కుంటారో

-2 లో



-2 లో

# కాంగ్రెస్ కు గాడిద గుడ్డు మిగిలింది



- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హవా
- రెండో స్థానంలో ఆప్
- కనీసం బోణీ కొట్టని కాంగ్రెస్
- ఈ ఘోర పరాజయంలో రాహుల్, రేవంత్ పాత్ర అమోఘం అంటూ హరీశ్ ట్వీట్

హైదరాబాద్ పెన్ పవర్:ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. కాంగ్రెస్ కనీసం ఒక్క స్థానంలో కూడా గెలిచే పరిస్థితి లేకపోవడం పట్ల ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు గాడిద గుడ్డు మిగిలిందంటూ

# హైదరాబాద్‌లోని కొత్త ఫ్లైఓవర్లపై లోతుగా అధ్యయనం చేయాలి

- పలు ప్రాజెక్టులపై పురపాలక శాఖ, జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష
- మీరాలం చెరువుపై బ్రిడ్జి నిర్మాణానికి 90 రోజుల్లో డీపీఆర్ తయారు చేయాలన్న ముఖ్యమంత్రి
- రహదారుల విస్తరణపై పలు సూచనలు



-2 లో

# తెలంగాణలో ఎప్పటికీ బీజేపీ అధికారంలోకి రాదు

- తెలంగాణలో అధికారంలోకి వస్తామని బీజేపీ నేతలు కలలు కంటున్నారు: టీపీసీసీ చీఫ్
- ఢిల్లీ ఎన్నికలను తెలంగాణ ఎన్నికలతో పోల్చడం విడ్డూరమన్న మహేశ్ కుమార్ గౌడ్
- తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి రాదని వ్యాఖ్య
- కేజ్రీవాల్ స్వయంకృతాపరాధమే ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమికి కారణమన్న టీపీసీసీ చీఫ్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో అధికారంలోకి వస్తామని భారతీయ జనతా పార్టీ నేతలు కలలు కంటున్నారని, కానీ అవి పగటి కలలేనని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పలువురు తెలంగాణ బీజేపీ నేతలు స్పందిస్తూ, తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. వారి వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఢిల్లీ ఎన్నికలు, తెలంగాణ ఎన్నికలకు చాలా తేడా ఉంటుందని ఆయన



అన్నారు. ఢిల్లీలో ఎన్నికల ఫలితాలను చూసి బీజేపీ నాయకులు ఆనందిస్తున్నారని, కానీ మన రాష్ట్రంలో ఎప్పటికీ గెలవలేరన్నారు. ఢిల్లీ ఎన్నికలను పోల్చుతూ ఇక్కడి బీజేపీ నేతలు ఆనందపడటం విడ్డూరంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అరవింద్ కేజ్రీవాల్ స్వయంకృతాపరాధమే ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమికి కారణమన్నారు.



# ఢిల్లీ ప్రజలు ఆప్ ను చీపురుతో ఊడ్చేశారు

- ఢిల్లీలో బీజేపీ గెలుపు ముందే ఊహించిందేనన్న బండి సంజయ్
- ప్రజలు అవినీతి, జైలు పార్టీలు వద్దనుకున్నారని వ్యాఖ్య
- మేధావి వర్గం మొత్తం బీజేపీకే ఓటు వేసిందన్న కేంద్ర మంత్రి

-2 లో

# ఢిల్లీ ప్రజలు ఆప్ ను చీపురుతో ఊడ్చేశారు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అధికారం దిశగా దూసుకుపోతోంది. ప్రస్తుత ట్రెండ్స్ ప్రకారం మొత్తం 70 స్థానాల్లో 42 చోట్ల బీజేపీ ఆధిక్యంలో ఉంది. 28 చోట్ల ఆప్ లీడ్ లో ఉంది. కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలో కూడా పోటీ ఇవ్వలేకపోతోంది.మరోవైపు ఎన్నికల ఫలితాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ... ఢిల్లీలో కాషాయ జెండా ఎగురుతుందనేది ముందే ఊహించిందేనని చెప్పారు. ఢిల్లీ ప్రజలు ఆప్ ను చీపురుతో ఊడ్చేశారని అన్నారు. ప్రజలు ప్రజాస్వామ్యబద్ధమైన పాలనను కోలుకున్నారని... అవినీతి, కుంభకోణాలు, జైలు పార్టీలు వద్దనుకున్నారని చెప్పారు. మేధావి వర్గం మొత్తం బీజేపీకే ఓటు వేసిందని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మేధావి, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. శాసనసభలో ప్రజల సమస్యలపై ప్రశ్నించేది బీజేపీ మాత్రమేనని చెప్పారు.

## బీజేపీకి పెరిగిన ఓట్ల శాతమెంత, ఆమ్ ఆద్మీ పార్టీకి తగ్గిందెంత?

**ఆమ్ ఆద్మీ పార్టీకి 10 శాతం తగ్గిన ఓట్లు**

**బీజేపీకి పెరిగిన 7 శాతం ఓట్లు**

**ఆమ్ ఆద్మీ పార్టీకి 40 సీట్లు తగ్గి బీజేపీకి పెరిగిన వైనం**



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గత ఎన్నికలతో పోలిస్తే 7 శాతం అధికంగా ఓట్లు సాధించింది. ఫలితంగా ఆ పార్టీ గత ఎన్నికల కంటే 40 సీట్లు అధికంగా గెలుచుకుంది. అదే సమయంలో, ఆమ్ ఆద్మీ పార్టీ ఓటు బ్యాంకు 10 శాతం క్షీణించడంతో ఆ పార్టీ 40 సీట్లు నష్టపోయింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు గాను బీజేపీ 48 స్థానాల్లో, ఆమ్ ఆద్మీ పార్టీ 22 స్థానాల్లో విజయం సాధించాయి. బీజేపీ 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో అధికారంలోకి వచ్చింది.

2015, 2020, 2025 ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం క్రమంగా పెరుగుతూ వచ్చింది. తాజా ఎన్నికల్లో బీజేపీ 45.76 శాతం, ఆమ్ ఆద్మీ పార్టీ 43.55 శాతం, కాంగ్రెస్ 6.36 శాతం ఓట్లను సాధించాయి.2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం 38.51 శాతంగా ఉండగా, ప్రస్తుతం అది ఏడు శాతానికి పైగా పెరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఓట్ల శాతం గత ఎన్నికల్లో 53.57 శాతంగా ఉండగా, ప్రస్తుతం దాదాపు పది శాతం తగ్గింది. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు 2020లో 4.26 శాతంగా ఉండగా, ఈసారి 6.36 శాతానికి పెరిగింది.

# హైదరాబాద్‌లోని కొత్త ఫ్లైఓవర్లపై లోతుగా అధ్యయనం చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో ప్రతిపాదిత ఫ్లైఓవర్ల నిర్మాణంపై సమగ్ర అధ్యయనం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని పలు అభివృద్ధి ప్రాజెక్టులపై పురపాలక శాఖ, జీహెచ్ఎంసీ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. మీరాలం చెరువుపై బ్రిడ్జి నిర్మాణానికి 90 రోజుల్లో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేయాలని, 30 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ చెరువుపై అధికారులు మూడు ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి సమర్పించారు. సుమారు 2.5 కిలోమీటర్ల మేర బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి పలు మార్పులు, చేర్పులు సూచించారు. రెండు రోజుల్లో మార్పులు, చేర్పులు చేసి పూర్తి సమాచారంతో తిరిగి రావాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. మీరాలం బ్రిడ్జిని ఒక ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. అదే సమయంలో, హైదరాబాద్‌లో రహదారుల విస్తరణకు సంబంధించి పలు సూచనలు చేశారు.

# చెల్లి ఢిల్లీలో కాలు పెట్టింది..కేజ్రీవాల్ కొంపముంచింది

- మొదటి పేజి తరువాయి

తెలియని పరిస్థితి ఉంది. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును కేసీఆర్ 58 నుంచి 61కు పెంచితే... రేవంత్ రెడ్డి 65కు పెంచారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు డబ్బులు ఇవ్వాల్సి వస్తుందనే ఇలా చేశాడు. ఇలాంటి చిల్లర నిర్ణయాల వల్ల కొత్త ఉద్యోగ నియామకాల మీద ప్రభావం పడుతుంది.

30 మెడికల్ కాలేజీలు పెట్టడం కంటే మూడు వందల యూట్యూబ్ ఛానల్ పెట్టుకోవడం మంచిదని చెప్పిన కేటీఆర్... ఇప్పుడు అదే పని చేస్తున్నడు. రాహుల్ గాంధీ సపోర్టుతోనే బీజేపీ గెలిచిందని కేటీఆర్ పిట్టకథలు చెబుతున్నడు. మీ అయ్య కేసీఆర్ పదేళ్లు సీఎం, పదేళ్లు ఉద్యమం చేశాడు. నువ్వు, మీ బావ, మీ అయ్య...

ఎమ్మెల్యేలుగా ఉన్నా... ఎందుకు మీకు ఎమ్మెల్సీ అభ్యర్థి దొరకడం లేదు కేటీఆర్. అభ్యర్థిని బరిలోకి దింపకుండా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వాత తమ ఓట్లతోనే గెలిచారని చెప్పుకునేందుకు బీఆర్ఎస్ స్కెచ్ వేస్తుందని రఘునందన్ రావు వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ కు గాడిద గుడ్డు మిగిలింది

- మొదటి పేజి తరువాయి

ఎద్దేవా చేశారు. మొన్న హర్యానా, నిన్న మహారాష్ట్ర, నేడు ఢిల్లీ... ఈ ఘోర పరాజయాల్లో రాహుల్, రేవంత్ రెడ్డిల పాత్ర అమోఘం అంటూ ట్వీట్ చేశారు. "ఇక్కడ (తెలంగాణ) హామీలు అమలు చేయకుండా... ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేసుకున్నంత మాత్రాన మీకు ఓట్లు పడతాయా? మీ గ్యారెంటీల నిజస్వరూపం దేశవ్యాప్తంగా బట్టబయలైంది. ఢిల్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆగమాగం చేసిన కులగణన బెడిసికొట్టింది. ఇప్పటికైనా తప్పులు ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పి కులగణనను మళ్లీ నిర్వహించండి. అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా చూడండి. 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసి అప్పుడు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారం చేసుకోండి రేవంత్ రెడ్డి గారూ! లేదంటే... మీరు ఎక్కడ అడుగుపెట్టినా ఇవే ఫలితాలు

పునరావృతం అవుతాయి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లోనూ ప్రజలు మీకు తగిన గుణపాఠం చెబుతారు" అంటూ హరీశ్ రావు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటివరకు ఉన్న సమాచారం మేరకు... బీజేపీ 23 స్థానాల్లో గెలిచి మరో 28 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ 11 చోట్ల గెలిచి మరో 8 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది.

# రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు అనుకూలమైన వాతావరణం ఉంది: కేటీఆర్

- త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందన్న కేటీఆర్
- వికారాబాద్‌లో ఎవరికి టిక్కెట్ ఇచ్చినా కలిసి పని చేయాలని సూచన
- కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణకు తెచ్చింది గుండు సున్నా అని విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితికి (బీఆర్ఎస్) అనుకూలమైన వాతావరణం ఉందని, ముఖ్యమంత్రిగా కె. చంద్రశేఖర రావు తిరిగి రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వికారాబాద్ జిల్లా నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే పది, పదిహేను రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వికారాబాద్‌లో ఆరు జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయని, గెలిచే అవకాశాలున్న అభ్యర్థులకే టిక్కెట్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.ఎవరికి టిక్కెట్ ఇచ్చినా పార్టీలోని వారంతా ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని, అలా చేయని పక్షంలో నష్టపోయేది మనమేనని ఆయన అన్నారు. లేకుంటే మనమే నష్టపోతామని అన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ నుండి ఎన్నికైన ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి సాధించింది శూన్యమని ఆయన విమర్శించారు.

# తెలంగాణలో కొత్త రేషన్ కార్డులకు బ్రేక్ పై..
# ఈసీ ఏమంటోంది..?




**హైదరాబాద్ పెన్ పవర్:**కొత్త రేషన్ కార్డులు, కొత్త రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి బ్రేక్ వేసింది ఎన్నికల కమిషన్. మీ సేవలో దరఖాస్తు చేసుకునే అవకాశానికి బ్రేక్ వేసింది ఈసీ.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 41 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించిన విషయం తెలిసిందే.. కొత్త రేషన్ కార్డులు, పాత కార్డుల్లో మార్పులు చేర్పులకు మీ సేవా ద్వారా అప్లికేషన్లు పెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది నిరంతర ప్రక్రియ అని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ప్రజాపాలన సదస్సులు ఇటీవల జరిగిన గ్రామ, వార్డు సభల్లో భారీగా దరఖాస్తులు అందాయి. హైదరాబాద్ ప్రజాభవన్ తో పాటు జిల్లాల్లో ప్రజావాణి కార్యక్రమం లోనూ దరఖాస్తులు వస్తున్నాయి. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించాలని డుప్లికేట్ లేకుండా అర్హులకు అందేందుకు వీలుంటుందని పౌరసరఫ రాల శాఖ పేర్కొంది.

**రేషన్ కార్డులకు బ్రేక్ పై ఈసీ వివరణ**

తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి బ్రేక్ వేసినట్లు వస్తున్న వార్తలు, సోషల్ మీడియాలో ప్రచారంపై ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. అలాంటిది ఏమీ లేదని.. కొత్త రేషన్ కార్డుల జారీపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై ఎలాంటి ఆంక్షలు విధించలేదని.. మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని వివరణ ఇచ్చింది ఈసీ.

# పాకిస్తాన్ జైల్లో అల్లు అర్జున్ ఫ్యాన్..
# అతడి వల్లే తండేల్ సినిమా తీశారా.?



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు స్టార్ హీరో నాగ చైతన్య హీరోగా నటించిన తండేల్ సినిమా శుక్రవారం రిలీజ్ అయ్యింది. ఈ సినిమా మంచి పాజిటివ్ టాక్ తో దూసుకుపోతోంది. తండేల్ సినిమా రిలీజ్ రోజే రూ.21.27 కోట్లు కలెక్ట్ చేసి నాగ చైతన్య కెరీర్ లోనే బెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా రికార్డులు క్రియేట్ చేసింది. అయితే శ్రీకాకుళానికి చెందిన మత్స్యకారుల లైఫ్ లో జరిగిన రియల్ లైఫ్ ఇన్సిడెంట్స్ ఆధారంగా ఈ సినిమాని తీశారనేది అందరికీ తెలిసిన విషయమే.. కానీ తండేల్ సినిమా వెనుక ఎవరికీ తెలియని మరో స్టోరీ మరొకటి ఉందట.

2019లో మత్స్యకారులు అరెస్ట్ అయ్యి జైలుకి వెళ్లినప్పుడు అదే జైలులో పాకిస్థాన్ కి చెందిన అల్లు అర్జున్ ఫ్యాన్ కానిస్టేబుల్ గా పని చేస్తున్నాడట.. అయితే ఈ మత్స్యకారులతో మాట్లాడుతూ తాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కి వీరాభిమాని అని, జైలు నుంచి రిలీజ్ అయ్యి వెళ్లిన తర్వాత అల్లు అర్జున్ తో ఒక్క ఆటోగ్రాఫ్ తీసుకుని తనకి పంపించాలని అడ్రస్ కూడా ఇచ్చాడట. అయితే మత్స్యకారులు రిలీజ్ అయ్యి ఇండియాకి వచ్చిన అల్లు అర్జున్ ఆటోగ్రాఫ్ కోసం తర్వాత కార్తీక్ అనే రైటర్ ద్వారా బన్నీ వాసుని సంప్రదించి తమ స్టోరీ చెప్పగా ఇంట్రెస్టింగ్ గా ఉందంటూ డైరెక్టర్ కి చెప్పి స్టోరీని డెవలప్ చేయించాడట. దీంతో తండేల్ సినిమా పాకిస్థాన్ జైల్లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ఆటోగ్రాఫ్ అడగడం వల్లే తీశారని ప్రచారం జరుగుతోంది. ఏదేమైనప్పటికే ఈ విషయంతో అల్లు అర్జున్ కి ఇండియాలోనే కాదు వరల్డ్ వైడ్ గా డై హార్ట్ ఫ్యాన్స్ ఉన్నారని ప్రూవ్ అయ్యింది.ఈ విషయం ఇలా ఉండగా ఐకాన్ అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప 2: ది రూల్ గత ఏడాది చివరిలో రిలీజ్ అయ్యింది. ఈ సినిమా వరల్డ్ వైడ్ గా దాదాపుగా రూ.2200 కోట్లు (గ్రాస్) కలెక్ట్ చేసింది. అంతేకాదు బాలీవుడ్, టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలలో రికార్డులు క్రియేట్ చేసింది. ప్రస్తుతం అల్లు అర్జున్ త్రివిక్రమ్ శ్రీనివాస్ డైరెక్ట్ చేస్తున్న సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఫుల్ డీటెయిల్స్ త్వరలోనే తెలిసే అవకాశం ఉంది.

## వీళ్లు మామూలోళ్లు కాదు. . ఊరినే తాకట్టు పెట్టారు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏకంగా ఊరినే తాకట్టు పెట్టిన సంఘటన ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం సిద్దెనపాలెంలో జరిగింది. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఏకంగా గ్రామ కంఠం భూమిని బ్యాంకులో తాకట్టుపెట్టి లోన్లు తీసుకున్నారు. గ్రామస్థుల ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులను ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.పుల్లలచెరువు మండలం సిద్దెనపాలెం గ్రామానికి చెందిన గద్దం సుబ్బయ్య, రామకోటయ్యలు గ్రామంలోని గ్రామ సర్వే నెం 296లో 8 ఎకరాల భూమిని రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లతో ఆన్ లైన్ చేసుకొని బ్యాంకుల్లో లోన్లు పొందారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి 14 రోజుల రిమాండ్ కు తరలించారు. అయితే నిందితులకు సహకరించిన వీఆర్వో, %=×%, రికార్డు ఇంచార్జీ, డిప్యూటీ తహశీల్దారు, కంప్యూటర్ ఆపరేటర్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లక్షల్లో లంచాలు తీసుకొని నిందితులకు సహకరించిన వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రికార్డు స్థాయిలో బంగారం ధరలు.. ఇలా పెరిగితే కొనడం కష్టమే



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్లో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. 24 క్యారెట్ల బంగారం ధర రూ.87,650 దాటింది. ఈ అసాధారణ పెరుగుదల భారతదేశం అంతటా ఉంది. బంగారం ధరలు రాబోయే కొద్దిరోజుల్లోనే లక్ష మార్క్ ను చేరేలా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ఆందోళనలు, మార్కెట్ అస్థిరత బంగారం ధరల పెరుగుదలకు కారణం.

శుక్రవారం ( ఫిబ్రవరి 08) హైదరాబాద్లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 79,450 రూపాయలుగా ఉండగా 24 క్యారెట్ల బంగారం ధర 87,650 రూపాయలకు చేరింది. గతవారం 24 క్యారెట్ల బంగారం ధర 84,000 రూపాయలుగా ఉండగా 22 క్యారెట్ల బంగారం ధర 77,300 రూపాయలుగా ఉంది. దీనితో పోలిస్తే ఇది దాదాపు 4 శాతం పెరిగింది.

ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు గణనీయంగా పెరిగాయి. బంగారంపై పెట్టుబడి సురక్షితంగా భావించడం..ప్రజలు బంగారంపై పెట్టుబడి పెట్టేందుకు ఎక్కువగా ఆసక్తి చూపడం కూడా బంగారం ధరల పెరుగుదలకు ఆజ్యం పోస్తుంది. బంగారం ధరలను అనేక ప్రపంచం, దేశీయ అంశాలు ప్రభావితం చేస్తున్నాయి. సుంకాలపై ఆర్థిక అనిశ్చితి, ఆర్థిక లోటులు ,డీడాలరైజేషన్, ట్రంప్ వాణిజ్య విధానాలు ,భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి అంశాలు బంగారం ధరల్లో పెరుగుదలను ప్రభావితం చేస్తున్నాయి.

బంగారం ధరల పెరుగుదల , తగ్గుదల వంటివి అమెరికా వాణిజ్య విధానాలు, ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు ,ప్రపంచ మార్కెట్ కదలికలు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ రంగాలలో ఏవైనా ముఖ్యమైన మార్పులు జరిగితే బంగారం ధరలలో మరింత హెచ్చుతగ్గులకు దారితీయవచ్చు.

## ఎంఐఎం పోటీతో లాభపడ్డ బీజేపీ.. ఎలా అంటే.?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది . ప్రస్తుతం బీజేపీ 48, ఆప్ 22 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ప్రభుత్వ ఏర్పాటు కంటే అత్యధిక స్థానాల్లో ఆధిక్యంలో ఉండటంతో 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ గడ్డపై కాషాయ జెండా ఎగరబోతుంది. అయితే ఈ ఎన్నికల్లో ఎంఐఎం పోటీతో ఒక నియోజకవర్గంలో బీజేపీ పడింది. ఢిల్లీలోని ముస్తాఫాబాద్‌లో బీజేపీ అభ్యర్థి మోహన్ సింగ్ బిష్త్ 17 వేల ఓట్లకు పైగా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఈ నియోజకవర్గంలో ఎంఐఎం అభ్యర్థి తాహిర్ హుస్సేన్ 30 వేలకు పైగా ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి అలీ మెహ్దీ10 వేలకు పైగా ఓట్లు సాధించారు. ఎంఐఎం, కాంగ్రెస్ పోటీ కారణంగా ఆప్ అభ్యర్థి అదీల్ అహ్మద్ ఖాన్ వెనుకంజలో కొనసాగుతున్నారు. కాంగ్రెస్,ఆప్ విడిగా పోటి చేయడం వల్ల ఓట్లు చీలి బీజేపీకి పడ్డాయని తెలుస్తోంది.

**సీఎం ఎవరు.?**

ఢిల్లీలో బీజేపీ విజయం ఘన విజయం సాధించడంతో.. నెక్ట్స్ సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై అప్పుడే చర్చలు మొదలయ్యాయి. ఆప్ అధినేత కేజ్రీవాల్ ను మట్టికరిపించిన పర్వేష్ వర్మ పేరు సీఎం రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. సీఎం అభ్యర్థిగా పర్వేష్ పేరు దాదాపు ఖాయమైనట్లేనని బీజేపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. న్యూఢిల్లీ సెగ్మెంట్లో విజయం సాధించిన వెంటనే పర్వేష్ వర్మ కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాతో భేటీ కావడం ఈ వార్తలకు మరింత బలం చేకూర్చాయి. మరీ ఢిల్లీ సీఎం పగ్గాలను బీజేపీ ఎవరికీ అప్పగిస్తుందో తెలియాలంటే కాస్త వెయిట్ చేయాల్సిందే.

## తాండూరులో వరుస చోరీలు.. 50 తులాలకు పైగా బంగారం చోరీ



**హైదరాబాద్ పెన్ పవర్:**వికారాబాద్ జిల్లా తాండూరులో వరుస చోరీలు కలవర పెడుతున్నాయి. పట్టపగలే దొంగతనాలు చేస్తున్నారు. లేటెస్ట్ గా పట్టపగలే తాండూరులో మరోచోరి జరిగింది. ఓ విలేకరి ఇంట్లో చొరబడిన దుండగులు 15 తులాల బంగారంతో పాటు నగదు ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూజ్ టీంతో పరిశీలిస్తున్నారు .

అంతకు ముందు తాండూరు పట్టణం సాయిపూర్ లోని ఓ ఇంట్లో భారీగా బంగారం చోరీ జరిగింది. బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి వచ్చే వరకు ఇంటికి కన్నం వేశారు దొంగలు. ఇంటి తాళాలు పగలగొట్టి నగదు, 40 తులాల బంగారం ఎత్తుకెళ్ళారు దుండగులు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. దుండగుల కోసం ప్రత్యేకంగా రంగంలో దిగిన పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఫిబ్రవరి 7న పట్టపగలే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చొరబడ్డ దొంగలు 2 తులాల బంగారం,20 తులాల వెండి,30 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఇలా వరుస చోరీలతో తాండూరు వాసులు భయాందోళనకు గురవుతున్నారు.


## మేడిబావి ప్రాంతంలో పర్యటించిన కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ

**సికింద్రాబాద్ పెన్ పవర్:** కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ మేడిబావి ప్రాంతంలో వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ప్రతిరోజూ రెగ్యులర్ గా డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుంది అని కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె ఆ ప్రాంతంలో అధికారులతో పర్యటించి డ్రైనేజీ లైన్ ను పరిశీలించి సమస్యను గుర్తించారు. ఈ సందర్భంగా యాక్షన్ ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన డ్రైనేజీ లైన్ కి ప్రపోజల్స్ తయారు చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా డ్రైనేజీ లైన్ పనులకు నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయాలని అధికారులను కోరారు. త్వరగా పనులు పూర్తి ఓవర్ ఫ్లో కాకుండా శాశ్వత పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని ఆమె స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకురావాలని కోరారు. రేవంత్ రెడ్డి పాలనలో ఫించన్లు,డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఆశ చూపారని మాకు ఎలాంటి స్కీమ్ వర్తించలేదని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా ప్రజల తరపున మేము ప్రశ్నిస్తూనే ఉన్నామని మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు

# హెబ్రోన్ చర్చి పై తీన్మార్ మల్లన్న దాడి ఖండించిన క్రైస్తవ సంఘాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ముషీరాబాద్ లోని హెబ్రోన్ చర్చి పైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆయన అనుచరులతో కలిసి దాడి చేయడాన్ని ఓయూ విద్యార్థి సంఘాలు, క్రైస్తవ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. గడ్డం అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. చర్చిలో ఆధిపత్యం చలాఇస్తున్న ఒక వర్గం దగ్గర మల్లన్న డబ్బులు తీసుకొని ప్రార్థన చేస్తున్న క్రైస్తవులపై పాస్టర్లపై దాడి చేశారని ఆరోపించారు. ఎమ్మెల్సీ అయినంత మాత్రాన ప్రభుత్వ ఆధీనంలో లేని ప్రైవేటు స్థలానికి సంబంధించిన దాంట్లో తీన్మార్ మల్లన్న ఇన్వాల్వ్ అయి క్రైస్తవుల మీద ఎలా దాడి చేస్తారని ప్రశ్నించారు.

# ఇక పెళ్లిళ్లు అయినట్లే : సిబిల్ స్కోర్ తక్కువ ఉందని.. పెళ్లి రద్దు చేసుకున్న అమ్మాయి




**హైదరాబాద్ పెన్ పవర్:** పెళ్లి అంటే అటు ఏడు తరాలు.. ఇటు ఏడు తరాలు చూడాలనేది పాత సామెత.. మారుతున్న కాలంతో అమ్మాయికి అబ్బాయి.. అబ్బాయికి అమ్మాయి నచ్చితే చాలు అనే వరకు మొన్నటి వరకు ఇచ్చింది. నిన్నటి వరకు మాత్రం అమ్మాయి అయితే చాలు.. అబ్బాయి అయితే చాలు అనే వరకు వచ్చింది.. ఇప్పుడు కొత్తగా సిబిల్ స్కోర్ ఎంటర్ అయింది. అవును మరి.. అబ్బాయి సిబిల్ స్కోర్ (మన లావాదేవీలకు సంబంధించి ఇచ్చే రేటింగ్) (%జఱఎఱశ్రీ రాఞశీతీవ%) వరకు వచ్చింది. అబ్బాయి సిబిల్ స్కోర్ సరిగా లేదని.. స్కోర్ చాలా తక్కువగా ఉందనే కారణంతో ఏకంగా పెళ్లినే రద్దు చేసుకున్నది అమ్మాయి కుటుంబం. మహారాష్ట్రలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు సంచలనంగా మారింది. మహారాష్ట్ర రాష్ట్రం ముర్తిజాపూర్ ప్రాంతానికి చెందిన కుర్రోడు. ఐటీ ఉద్యోగి. ఉద్యోగానికి తగ్గట్టు.. జీతానికి తగ్గట్టు నాలుగు, ఐదు లోన్లు తీసుకున్నాడు. దర్జాగా బండి, ఇల్లు కొన్నాడు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుని సంబంధాలు చూశారు ఇంట్లో పెద్దలు. ఓ సంబంధం వచ్చింది. రెండు కుటుంబాలకు నచ్చింది. జాతకాలు కూడా కలిశాయి. కట్నకానుకలు, పెట్టుబడులు, కళ్యాణ మండపాలు అన్నీ మాట్లాడుతున్నారు. మంచి ముహూర్తంలో పెళ్లికి రెడీ అయ్యాయి రెండు కుటుంబాలు. పెళ్లి సంబంధం అంతా ఒకే అనుకున్న సమయంలో.. అమ్మాయి నాన్నకు ఓ డౌట్ వచ్చింది. అబ్బాయి బ్యాంక్ అకౌంట్, పాన్ నెంబర్ తీసుకుని సిబిల్ స్కోర్ చెక్ చేశాడు. అబ్బాయి సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని రిపోర్ట్ వచ్చింది. షాక్ అయ్యాడు. ఆర్థిక లావాదేవీలు సరిగా లేవని.. అప్పులు ఎక్కువగా ఉన్నాయని.. ఇలాంటి అబ్బాయికి మా అమ్మాయిని ఇచ్చేది లేదని డిసైడ్ అయ్యాడు. పెళ్లి రద్దు చేసుకున్నాడు.

అబ్బాయి మాత్రం లబోదిబో అంటున్నారు. %జువీ×%లు ఉన్నాయని.. బండి, ఇంటికి ఈఎంఐ కడుతున్నానని.. దుబారా కోసం అప్పులు చేయలేదని.. దీని వల్లే సిబిల్ స్కోర్ తక్కువగా వచ్చిందంటూ నెత్తీనోరూ బాదుకున్నాడు. అయినా సరే.. అమ్మాయి తండ్రి మాత్రం పెళ్లి రద్దు చేసుకున్నాడు. క్రెడిట్ కార్డు బిల్లులు కూడా నువ్వు సరిగా చెల్లించటం లేదు.. అలాంటి నీకు పెళ్లి ఎందుకు అంటూ వెళ్లిపోయింది ఆ సంబంధం. దేశంలోనే మొదటి సారి ఇలా సిబిల్ స్కోర్ కారణంగా పెళ్లి రద్దు కావటం. ఇది చర్చనీయాంశం అయ్యింది. అసలు సిబిల్ స్కోర్ అంటే ఏంటీ అంటే.. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో లిమిటెడ్ అందించే స్కో. ఇది సాధారణంగా 300 నుంచి 900 పాయింట్ల వరకు ఉంటుంది. స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు అంత ఎక్కువగా..

త్వరగా అప్పులు ఇస్తాయి. తీసుకున్న అప్పులకు మనం చెల్లించే విధానాన్ని బట్టి ఈ స్కోర్ ఉంటుంది. సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే బ్యాంకులు అప్పులు త్వరగా ఇవ్వకపోగా.. ఇచ్చేది కూడా చాలా తక్కువగా ఉంటుంది. మొత్తానికి భారతదేశంలో ఫస్ట్ టైం.. సిబిల్ స్కోర్ ఆధారంగా పెళ్లి రద్దు కావటం. ఇప్పుడు సిబిల్ స్కోర్ కూడా ఓ అర్హతగా లిస్టులో చేరిపోయింది కాబట్టి.. ఇక మగాళ్లకు పెళ్లిళ్లు అయినట్లే..

# ఢిల్లీలో ఆప్, కాంగ్రెస్ పార్టీలే బీజేపీని గెలిపించాయా..?

హైదరాబాద్ పెన్ పవర్:ఎంతో ఉత్కంఠగా ఎదురు చూసిన ఢిల్లీ ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. వరుసగా రెండు దఫాలుగా అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీ ఓడించింది. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది బీజేపీ. ఢిల్లీ ఓటమిపై కాంగ్రెస్, ఆప్ ఒకరినొకరు నిందించుకుంటున్నాయి. కేజ్రీవాల్ అతి విశ్వాసం వల్లనే ఢిల్లీలో బీజేపీ గెలిచిందని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ ఓట్లు కలిసి ఉంటే ఆప్ గెలిచేదని ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. అయితే ఢిల్లీ ఓటమికి ఇరు పార్టీల తప్పిదం ఉందని చెప్పకతప్పదు. ఇండియా కూటమి ఓట్ల చీలిక తోనే బీజేపీకి గెలుపు సులువైందనేది బహిరంగ సత్యం. సీట్ల పంపకాల్లో కుదరని సయోధ్యతో ఆప్, కాంగ్రెస్ విడివిడిగా పోటీ చేశాయి.



కాంగ్రెస్ అడిగినన్ని స్థానాలు ఆప్ ఇవ్వక పోవడం.. దీంతో చెరో దారి చూసుకొని కూటమి నిబంధనలకు బ్రేక్ వేశాయి రెండు పార్టీలు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ కు కలిపి దాదాపు 50 శాతం ఓట్ షేరింగ్ ఉండగా.. అందులో దాదాపు ఆప్ కు 43 శాతం, కాంగ్రెస్ 7 శాతానికి పైగా ఓట్ షేరింగ్ ఉంది.

అంటే 50 శాతం ఓట్ షేరింగ్ ఉన్న ఈ రెండు పార్టీలు విడివిడిగా పోటీ చేయడం ఢిల్లీకి కలిసి వచ్చింది. బీజేపీ 46.3 శాతం ఓట్ షేరింగ్ తో ఢిల్లీ పీఠంలో గెలుపొందింది. అంటే ఆప్, కాంగ్రెస్ ఓట్లు కలుపుకుంటే బీజేపీని ఓడించడం తేలికయ్యేది. కానీ ఆప్ అతి విశ్వాసం, కాంగ్రెస్ అడ్జస్ట్ కాలేకపోవడం ఢిల్లీలో కొంప ముంచిందని చెప్పవచ్చు. రెండు పార్టీల ఓట్లు చీలడంతో బీజేపీ గెలుపు సులువైంది.

దీనిపై కూటమి నేత ఒమర్ అబ్దుల్లా బహిరంగంగానే విమర్శించారు. మనం తగవులాడుకుంటే మూడో వారికి లాభం అన్నట్లుగా ఆప్, కాంగ్రెస్ విభేదాల కారణంగా బేజేపీకి గెలుపు కలిసొచ్చిందని ఆయన ఘాటు విమర్శలు చేశారు.

# ఆప్ పార్టీ పతనంలో స్వాతి మలివాల్.. ఇంతకీ ఎవరు ఈమె.. శపథం ఏంటీ..?

హైదరాబాద్ పెన్ పవర్:ఢిల్లీలో దాదాపు 27 ఏళ్ల తర్వాత కాషాయ జెండా ఎగరబోతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మెజారిటీ సాధించింది. 70 అసెంబ్లీ సీట్లలో బీజేపీ 40కి పైగా సీట్లలో ఆధిక్యంతో ఉంది. ఇక ఆప్ 20 కి పైగా సీట్లతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా ఓడిపోయారు. న్యూ ఢిల్లీ నుంచి పోటీ చేసిన కేజ్రీవాల్.. బీజేపీ అభ్యర్థి పర్వేష్ సాహెచ్ సింగ్ చేతిలో ఓడిపోయారు. 3 వేల ఓట్ల తేడా ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ ను ఓడించటం చాలా మంది ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే ఢిల్లీలో ఆప్ ఓటమి తర్వాత స్వాతి మలివాల్ మరోసారి తెరపైకి వచ్చింది. కేజ్రీవాల్ పతనానికి ఆమె కూడా ఒక విధంగా కారణం కావొచ్చనే చర్చ జరుగుతోంది. స్వాతి మలివాల్ చేసిన ప్రతిజ్ఞ ఇపుడు నిజమైందని చర్చ నడుస్తోంది. అసలు స్వాతి మలివాల్ ఎవరు.. ఇంతకీ ఆమె చేసిన ప్రతిజ్ఞ ఏంటో చూద్దాం.



### స్వాతి మలివాల్ ఎవరంటే.?

స్వాతి మలివాల్ 1984 అక్టోబర్ 15న ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జన్మించారు . స్వాతి మలివాల్ ప్రస్తుతం రాజ్యసభ ఎంపీ. సామాజిక కార్యకర్త అన్నా హజారే నేతృత్వంలోని 2011 భారత అవినీతి వ్యతిరేక ఉద్యమంలో ఆమె పాల్గొన్నారు. తరువాత ఆప్ లో పొలిటికల్ కెరీర్ స్టార్ట్ చేసింది. 2015 నుంచి 2024 వరకు ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు .

2024 మే 13న ముఖ్యమంత్రి నివాసంలో అప్పటి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ తనపై దాడి చేశాడని మలివాల్ ఆరోపించింది . ఈ సంఘటన అప్పట్లో సంచలనం రేపింది. మలివాల్ ఫిర్యాదుతో 2024 మే 16న ఢిల్లీ పోలీసులు%ఖీ×=% నమోదు చేశారు . గత 18 ఏండ్లుగా నేను కిందిస్థాయిలో పనిచేశానని...9 ఏండ్లలో మహిళా కమిషన్ లో 1.7 లక్షల కేసులు విన్నాను. ఎవరికీ భయపడకుండా, ఎవరి ముందు తలవంచకుండా మహిళా కమిషన్‌ను టాప్ పొజిషన్‌కు చేర్చాను. అయితే, సీఎం ఇంట్లో నన్ను దారుణంగా కొట్టి నా క్యారెక్టర్‌ను దిగజార్చారని ఆరోపించారు. అయితే తనపై జరిగిన దాడిపై

ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ మద్దతివ్వకపోతగా... కనీసం దాడిని కూడా ఖండించలేదు. తాను సేవ చేసిన పార్టీ తనను గుర్తించలేని ఆవేదన వ్యక్తం చేసింది. దుశ్శాసనుడి రక్తంతో తన జుట్టును కడుక్కోవాలని ద్రౌపది ప్రతిజ్ఞ చేసినట్లుగా..ఆప్ ద్రోహాన్ని బయటపెడతానని మలివాల్ గతంలో ప్రతిజ్ఞ చేసింది. లేటెస్ట్ గా కేజ్రీవాల్ ఓటమితో ఆమె మరోసారి పరోక్షంగా విమర్శలు చేశారు. రావణుడి అహంకారం కూడా ఆయన్ను రక్షించలేకపోయింది. మహాభారతం ఇతిహాసం నుంచి పాండవులు తమ దాయాదుల చేతిలో పందెం వేసి ఓడిపోయిన చిత్రాన్ని ఆమె పోస్ట్ చేసింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి పాలవ్వడం..కేజ్రీవాల్ కూడా ఓడిపోవడంతో.. స్వాతి మలివాల్ చేసిన ప్రతిజ్ఞ నిజమైందనే చర్చ జరుగుతోంది.

## కేకే సర్వే బూంరాంగ్ : ఢిల్లీలో తప్పిన లెక్క.. ఎగ్జిట్ పోల్ కు రివర్స్ గా రిజల్ట్స్




హైదరాబాద్ పెన్ పవర్:తెలుగు రాష్ట్రాల్లో పొలిటికల్ సర్వేల్లో అనూహ్యంగా దూసుకొచ్చింది కేకే సర్వే. ఏపీ ఎన్నికల ఫలితాల తర్వాత అతను ఓ ట్రెండ్.. ఎవరూ ఊహించని విధంగా అతను చెప్పినట్లే వైసీపీ సీట్లు రావటం అనేది సంచలనంగా మారింది. ఆ తర్వాత నుంచి కేకే సర్వేపై అంచనాలు భారీగా పెరిగాయి. హర్యానా ఫలితాలు భిన్నంగా వచ్చినా.. మహారాష్ట్రలో మాత్రం అతని ఎగ్జిట్ పోల్ సర్వే నిజం అయ్యింది.

ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కేకే ఎగ్జిట్ పోల్ కు భిన్నంగా వచ్చాయి. రివర్స్ అయ్యాయి. ఎగ్జిట్ పోల్ లో ఆప్ పార్టీ 44 సీట్లు.. బీజేపీ 26 సీట్లలో విజయం సాధిస్తుందని చెప్పగా.. ఫలితాలు మాత్రం వేరుగా వచ్చాయి. బీజేపీ 48 స్థానాల్లో, ఆప్ 22 సీట్లలో గెలుపొందింది. కేకే ఎగ్జిట్ పోల్ సర్వేకు క్వయిట్ ఆపోజిట్ లో ఎన్నికల ఫలితాలు రావటం విశేషం.ఏడాది కాలంలో కేకే సర్వే ఫలితాలు రెండు రాష్ట్రాల్లో ఆయన చెప్పినట్లు జరిగితే.. మరో రెండు రాష్ట్రాల్లో మాత్రం రివర్స్ అయ్యాయి. ఏపీ, మహారాష్ట్ర ఫలితాలు కేకే సర్వే నిజం అయితే.. హర్యానా, ఢిల్లీలో మాత్రం తప్పయ్యాయి. మొత్తానికి ఢిల్లీ ఫలితాలు మాత్రం కేకే సర్వేకు వ్యతిరేకంగా రావటం చర్చనీయాంశం అయ్యింది. కేకే సర్వే 50 శాతం మాత్రమే నిజం.. బొమ్మా బొరుసా అన్నట్లు ఉంటుందని కొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ దెబ్బ.. జైలుకెళ్లొచ్చిన ఆప్ ముగ్గురు అగ్రనేతల ఓటమి

హైదరాబాద్ పెన్ పవర్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీపై ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఎఫెక్ట్ భారీగా పడింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొని జైలుకి వెళ్లొచ్చిన ముగ్గురు ఆప్ అగ్రనేతలు ఓటమి పాలుకావడమే ఇందుకు నిదర్శనం. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏకంగా అప్పట్లో ఢిల్లీ సీఎంగా ఉన్న కేజ్రీవాల్, డిప్యూటీ సీఎంగా ఉన్న మనీష్ సిసోడియా, మంత్రిగా ఉన్న సత్యేంద్రజైన్ తీహార్ జైలుకు వెళ్లారు. కేజ్రీవాల్ దాదాపు 5 నెలల పాటు జైల్లో ఉండగా.. మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ దాదాపు రెండేళ్ల వరకు జైలు జీవితం గడిపారు. అనంతరం సుప్రీంకోర్టు వీరి ముగ్గురికి బెయిల్ మంజూరు చేసింది. జైలు నుంచి బయటకు వచ్చాక కేజ్రీవాల్ తన సీఎం పదవికి రాజీనామా చేసి.. ప్రజలు తనను అవినీతి పరుడు కాదని తీర్పు ఇచ్చాకే మళ్లీ ఢిల్లీ సీఎం పగ్గాలు చేపడతానని శపథం చేశారు. ఈ క్రమంలోనే కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ ఎన్నికల బరిలో నిలిచారు.

కేజ్రీవాల్ న్యూఢిల్లీ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బరిలోకి దిగగా.. సిసోడియా జంగ్ పురా, షత్పురపుర నుంచి సత్యేంద్రజైన్ పోటీలో నిలిచారు. కానీ అనుహ్యంగా ఈ ముగ్గురు అగ్రనేతలు ఓటమి పాలయ్యారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో జైలుకి వెళ్లిన ఈ ముగ్గురు నేతలు ఓటమి పాలుకావడం ఢిల్లీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీజేపీ తమను అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపిందని పదే పదే ఆరోపించిన ఆప్ నేతలు.. ఎన్నికల్లో జైలు సెంటిమెంట్ కలిసి వస్తుందని లెక్కలేసుకున్నారు.

కానీ, జైలుకు వెళ్లి వచ్చారనే సానుభూతి చూపకుండా ముగ్గురుని ప్రజలు ఓడించడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే.. 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమికి ప్రధాన కారణం ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక, 27 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ.. దేశ రాజధానిలో బీజేపీ విజయఢంకా మోగించింది. ఆప్ వరుస విజయాలకు బ్రేకులు వేసిన బీజేపీ హస్తినా పీఠం దక్కించుకుంది.

# ఢిల్లీలో బీజేపీ ఎలా గెలిచింది.. ఆప్‌ను ఎలా మట్టికరిపించింది..?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. దేశ రాజధాని ఢిల్లీలో ఎట్టకేలకు అధికారం చేజిక్కించుకుంది.. మొత్తం70 అసెంబ్లీ స్థానాలుండగా.. మ్యాజి క్ ఫిగర్ దాటి 47 చోట్ల బీజేపీ గెలుచుకుంది. దశాబ్దానికి పైగా రూలింగ్ లో ఉన్న ఆప్ పార్టీ వరుస విజయాలకు చెక్ పెట్టింది. దాదాపు 27 తర్వాత ఢిల్లీలో బీజేపీ ప్రభు త్వాన్ని ఏర్పాటు చేయనుంది. అయితే 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడ్డ బీజేపీ..ఈ ఎన్నికల్లో ఓట్ షేరింగ్ పెంచుకొని ఇంత ఘన విజయం సాధించడానికి దారితీసిన పరిస్థితులేంటి..

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారపార్టీ ఆప్ ప్రముఖ నేతలంతా ఓటమి చవిచూశారు. ఢిల్లీలో తిరుగులేని శక్తిగా బీజేపీ పార్టీ విజయం సాధించింది..అధికారాన్ని చేపట్ట బోతోంది.. ఈ క్రమంలో అందరిలో ఒకటే సందేహం..ఢిల్లీలో బీజేపీ పార్టీ విజయ రహస్యం ఏమిటీ అని.

దళితుల ఓట్లు, మధ్యతరగతి ప్రజల ఓట్లు, ఉచితాలపై రివర్స్ ప్లాన్ బీజేపీ ఘన విజయానికి బలమైన, ప్రధానమైన కారణాలు అని తెలుస్తోంది. దీంతో పాటు ఇంత కాలం ఆప్, కాంగ్రెస్ వెనకున్న ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్న సెగ్మెంట్లలో కూడా బీజేపీ వ్యూహం ఫలించడంతో మ్యాజిక్ ఫిగర్ దాటి అత్యధిక స్థానాలను గెలుచు కున్నదని తెలుస్తోంది.

ఢిల్లీలో బీజేపీకి ఘన విజయం కట్టబెట్టిన ప్రధాన అంశాలు ..

**ఎస్సీల ఓట్లు..**

దశాబ్దాలుగా అధికార పార్టీ ఆప్ కు అండగా ఉన్న ఢిల్లీ స్లమ్ ఏరియాల్లోని ఎస్సీ సామాజిక వర్గం ఈసారి బీజేపీకి జైకొట్టింది. ఉచిత కరెంట్, ఉచిత మంచినీటి సౌకర్యం వంటి వాగ్దానాలతో %ూూ% ప్రభుత్వం దళిత వర్గాన్ని ఆకట్టుకుంది. ఆప్ పార్టీకి అధికారం కట్టబెట్టిన కీలక సెగ్మెంట్లు ఢిల్లీ స్లమ్ ఏరియాల్లో




ఉన్నాయి. అయితే ఈసారి బీజేపీ ఢిల్లీ స్లమ్ ఏరియాల్లో దూసుకుపోయింది.

ఢిల్లీలో స్లమ్ ఏరియాలో దళితులను ఆకట్టుకోవడం బీజేపీ సక్సెస్ అయింది. ఈసారి దాదాపు 20 శాతం దళితుల ఓట్లను చీల్చింది. పక్కా ఇండ్లు, ఆప్ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత కరెంట్, ఉచిత వాటర్ వంటి పలు రకాల వాగ్దాలను కొనసాగిస్తామని ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేయడం బీజేపీకి కలిసొచ్చింది.

**ముస్లిం ఓటర్ల ప్రభావం ఉన్న స్థానాల్లోనూ..**

ఢిల్లీలో దాదాపు13 శాతం ముస్లిం వర్గాలను ఓట్లున్నాయి. దాదాపు9 నియోజకవర్గాల్లో వీరి ప్రభావ ఉంటుంది.దశాబ్ద కాలంగా ఢిల్లీలో ఆప్ పార్టీతో ఉన్న ముస్లింలు ఘనవిజయాలను అందించారు. అయితే ఈసారి 2020లో అల్లర్ల ప్రభావిత ప్రాంతాలైన ముస్తాఫాబాద్, కరవాల్ నగర్ వంటి కీలక స్థానాల్లో బీజేపీ బిగ్ విక్టరీ సాధించింది. ఈ స్థానాల్లో బలమైన కౌంటర్ పోలరైజేషన్ జరిగినట్టు కనిపిస్తోంది. దీంతోపాటు పూర్వాంచలి ఓట్లు బీజేపీకి భారీగా తరలిపోయాయి.

**మధ్య తరగతి సపోర్టు..**

ఢిల్లీలో మధ్యతరగతి ఓటర్లు 40 శాతం ఉన్నారు. వీరి ఓటుబ్యాంక్ ఆప్ నుంచి బీజేపీ పెద్ద ఎత్తున చీల్చింది. మధ్యతరగతి ప్రజలు బీజేపీవైపు మళ్లడానికి చాలా కారణాలే ఉన్నాయి. ముఖ్యంగా ఢిల్లీలో మౌలిక సదుపాయాలు హామీలు, 8వ వేతన సంఘం ప్రకటన అటు పేదలు, ఢిల్లీలో దాదాపు 12.75 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఆకట్టుకునేందుకు ఇన్ కమ్ ట్యాక్స్ మినహాయింపు బీజేపీని ఢిల్లీ పీఠం ఎక్కించిన కీలక అంశాల్లో ఉన్నాయి.

**ఉచితాలపై బీజేపీ మాస్టర్ ప్లాన్..**

2020 నుంచి ఆప్ ప్రభుత్వం ఇచ్చిన ఉచితాలను రేవడీలుగా అభివర్ణించిన బీజేపీకి బీజీపికి ఎదురు దెబ్బతగిలింది.. ఉచితాలవిషయంలో వ్యూహం మార్చిన ప్రధాని మోదీ.. బీజేపీ అధికారంలోకి వస్తే ఉచితాలు నిలిపివేయమని హామి ఇచ్చింది.

దీంతో పాటు ఆప్ పార్టీ ఇచ్చిన మహిళలకు నెలకు రూ. 2100 ఇస్తామన్న హామీని ఎదుర్కొనేందుకు మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఇటువంటి వాగ్దానాలతో ఢిల్లీలోని స్లమ్ ఏరియాల్లో %ూూ% ప్రధాన ఓటు బేస్‌ను %దీజ్రూ% చీల్చింది. %ూూ% నుంచి కొంతమేరకు మహిళా ఓటరును చీల్చింది. ఢిల్లీలోని 41 స్థానాల్లో పురుషుల కంటే ఓటింగ్ శాతం ఎక్కువగా ఉన్న మహిళా ఓటర్లు, బీజేపీ ఉచిత వాగ్దానాలతో ఈసారి బీజేపీకి జైకొట్టారు.

**మోదీ మేనియా..**

ఈసారి ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు మరో కారణం మోదీ మేనియా. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే మోదీ ఫేస్ వ్యాల్యూతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బలం సంపాదించుకుంది. 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తమ పార్టీకి అవకాశం ఇవ్వాలని ఢిల్లీ ఓటర్లకు బీజేపీ పెద్ద దిక్కు పీఎం నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేయడం కలిసొచ్చింది. కేజ్రీవాల్ పై వ్యతిరేకత, బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే ఢిల్లీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రధాని హామీ బాగా పనిచేసింది.

ఆప్ పార్టీపై ఆరోపణలు.. బీజేపీకి బూస్టింగ్

అవినీతి కుంభకోణాలు,షీష్ మహల్ వివాదం కేజ్రీవాల్ షీన్ తగ్గించాయి. కేజ్రీవాల్ సింపుల్ లివింగ్ , హై థింకింగ్ ఇమేజ్‌ను దెబ్బతీశాయి. కేజ్రీవాల్ ప్రభుత్వం ,కేంద్రం మధ్య నిరంతర గొడవలు బీజేపీకి బూస్టింగ్ ఇచ్చాయని చెప్పొచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ వ్యూహం ఫలించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. దశాబ్దానికి పైగా రూలింగ్ లో ఉన్న ఆప్ పార్టీ వరుస విజయాలకు చెక్ పెట్టింది. దాదాపు 27 తర్వాత ఢిల్లీలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఇప్పుడు ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలకు బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందా.. ప్రజలకు ఏమేర సంక్షేమం అందనుంది అనేదానిపైనే ఇప్పుడు అందరి దృష్టి.

# కేజ్రీవాల్‌ను ఓడించిన బీజేపీ నేత... ఎవరీ పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ?

- కేజ్రీవాల్‌పై 4 వేల పైచిలుకు మెజార్టీతో గెలిచిన పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ
- 2013లో రాజకీయ ఆరంగేట్రం చేసిన పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ
- ఎన్నికలకు ముందు 'రిమూవ్ కేజ్రీవాల్ సేవ్ నేషన్' ప్రచారాన్ని ప్రారంభించిన వర్మ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను బీజేపీ అభ్యర్థి పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ ఓడించారు. దీంతో ముఖ్యమంత్రి రేసులో ప్రధానంగా ఆయన పేరు వినిపిస్తోంది. కేజ్రీవాల్, పర్వేశ్ వర్మ మధ్య హోరాహోరీగా కనిపించింది. చివరకు పర్వేశ్ వర్మ 4 వేల పైచిలుకు ఓట్లతో న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుండి విజయం సాధించారు.



పర్వేశ్ వర్మ 30,088 ఓట్లు, కేజ్రీవాల్ 25,999 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్‌కు కేవలం 4,568 ఓట్లు పడ్డాయి.

పర్వేశ్ వర్మ విజయం సాధించిన తర్వాత, మీడియా ఆయనను పలకరించింది. మీరే ముఖ్యమంత్రి అని ప్రచారం సాగుతోందని మీడియా ప్రశ్నించింది. స్పందించిన పర్వేశ్ వర్మ, తమ పార్టీ శాసనసభాపక్షం సమావేశమై ముఖ్యమంత్రిని నిర్ణయిస్తుందని వెల్లడించారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా తమకు అంగీకారమే అన్నారు. తనకు ఓటు వేసి గెలిపించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తన గెలుపు కోసం శ్రమించిన కార్యకర్తలకు, ప్రధాని నరేంద్రమోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇది నరేంద్ర మోదీ విజయమని వ్యాఖ్యానించారు. ఢిల్లీ ప్రజలు మోదీని పూర్తిగా విశ్వసించారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు.

పర్వేశ్ వర్మ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుండి వచ్చారు. ఆయన తండ్రి బీజేపీ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ. ఆయన మరో బంధువు నార్త్ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పని చేశారు.

పర్వేశ్ వర్మ 1977లో జన్మించారు. ఆయన ఆర్కేపురం లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివారు. కిరోరి మాల్ కాలేజీ నుండి బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేశారు.

ఎంబీఏ పట్టభద్రుడైన వర్మ 2013లో రాజకీయ ఆరంగేట్రం చేశారు. మెహ్రౌలి అసెంబ్లీ నియోజకవర్గం నుండి విజయం సాధించారు. 2014లో వెస్ట్ ఢిల్లీ లోక్ సభ స్థానం నుండి గెలిచారు. 2019లో రెండోసారి అదే నియోజకవర్గం నుండి 5.78 లక్షల మెజార్టీతో గెలిచారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, పర్వేశ్ వర్మ 'రిమూవ్ కేజ్రీవాల్-సేవ్ నేషన్' (కేజ్రీవాల్‌ను ఓడిద్దాం-దేశాన్ని రక్షిద్దాం) అనే ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ప్రచారంలో భాగంగా అతను ఆమ్ ఆద్మీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ముఖ్యంగా, కాలుష్యం, మహిళల రక్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలను లేవనెత్తారు.

# ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో... కేటీఆర్‌కు మంత్రి కొండా సురేఖ కౌంటర్

- కేటీఆర్ నుండి అలాంటి ప్రకటన ఆశ్చర్యాన్ని కలిగించిందన్న మంత్రి
- మీ మోదీ అంకుల్ గెలుపులో మీ సోదరి కీలక పాత్ర పోషించిందని ఎద్దేవా
- నెక్స్ట్ టైమ్ బెటర్ లక్ అంటూ కేటీఆర్‌కు చురక



**హైదరాబాద్ పెన్ పవర్:**మీ మోదీ అంకుల్ గెలుపులో కీలక పాత్ర పోషించిన మీ సోదరి కవితను అభినందించాలని మంత్రి కొండా సురేఖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీలో బీజేపీ గెలిచిన నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. బీజేపీ విజయానికి కృషి చేసిన అతిపెద్ద కార్యకర్త రాహుల్ గాంధీయేనని ఎద్దేవా చేశారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు.కేటీఆర్ నుండి ఇలాంటి ప్రకటన తమను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. 2019, 2024 లోక్ సభ ఎన్నికలలో కరీంనగర్ నుండి బీజేపీ గెలిచిందన్నారు. అలాగే మీ సోదరి కవిత నిజామాబాద్ లోక్ సభ స్థానం నుండి ఓడిపోయారని గుర్తు చేశారు. ఈ విషయాలను గుర్తుంచుకొని మాట్లాడాలన్నారు. మీ మోదీ అంకుల్ గెలుపులో కీలక పాత్ర పోషించినందుకు మీ సోదరిని అభినందించాలని మద్యం కేసును ఉద్దేశించి కౌంటర్ ఇచ్చారు.రాజ్యాంగానికి మించిన వారు ఎవరూ లేరని లోక్ సభ ఎన్నికల ఫలితాల ద్వారా మోదీకి అర్థమయ్యేలా రాహుల్ గాంధీ చేశారని పేర్కొన్నారు. వారి నాయకత్వం మీ కుటుంబానికి అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుని పదవిని కట్టబెట్టేందుకు సహాయపడిందన్నారు. అయినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సున్నాతో తుడిచిపెట్టుకుపోయిందని విమర్శించారు.రాహుల్ గాంధీ ప్రభావాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేయవద్దని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా వెనుకాడుతోందని చురక అంటించారు. నిజంగా అర్హులైన వారిని అభినందించడం మరిచిపోవద్దని, కనీసం నెక్స్ట్ టైమ్ బెటర్ లక్ అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# కులగణను చట్టబద్ధతకే ప్రాధాన్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** మంత్రివర్గ విస్తరణ కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న కాంగ్రెస్ నేతల ఆశలపై అధిష్ఠానం నీళ్లు చల్లింది. మంత్రివర్గ కేటాయింపుపై ఏకాభిప్రాయం కుదరనందున ఇప్పుడప్పుడే కొత్త అమాత్యులకు చోటు లేదని కాంగ్రెస్ పెద్దలు చెప్పినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు. ఎప్పుడనేది కూడా ఇప్పుడే చెప్పలేమన్నారన్నారు. మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన రేవంత్...పలు అంశాలపై చర్చించారు. కేటీఆర్, హరీశ్‌రావు అరెస్ట్‌కు ఇప్పుడే తొందరలేదన్న ఆయన... ప్రధాని మోదీ ఓబీసీనే కాదని....నాడు సీఎం పదవిని అడ్డుపెట్టుకుని ఓబీసీ హోదా సంపాదించారన్నారు. కులగణన పకడ్బందీగా చేపట్టామని...ఏ ఒక్క వర్గం నుంచి వ్యతిరేకత ఎదురవ్వకుండా చరిత్రలో ఇంత శాస్త్రీయంగా కులగణన చేపట్టినవారు ఎవరూ లేరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కులగణనకు చట్టబద్ధత కల్పిస్తామని ఆయన ప్రకటించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో ముస్లింలతో కలుపుకుని ఓబీసీలు 51శాతం ఉంటే ఇప్పుడు 56 శాతానికి పైగా పెరిగింది. గతంలో 21శాతం ఉన్న ఓసీ(రాఅ)ల సంఖ్య 15శాతానికి పడిపోయింది. ఇంత శాస్త్రీయంగా లెక్కలు ఉన్నా....విపక్షాలు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నాయని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు.క్రైస్తవులు అన్ని వర్గాల్లో ఉన్నారు కాబట్టి వారిని...జైన్‌లు,సిక్కులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు కాబాట్టి వారిని ప్రత్యేకవర్గంగా లెక్కకట్టలేదని సీఎం తెలిపారు.ముఖ్యమంత్రి పీఠాన్ని ఓబీసీ(లకు ఇవ్వాలని డిమాండ్ చేసే హక్కు,అర్హత రెండూ బీజేపీ(కి లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో అధిష్టాన పెద్దలను కలిసిన అనంతరం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన సీఎం....సీఎం పీఠం బీసీలకు ఇవ్వాలంటున్న బీజేపీ..రెండు తెలుగురాష్ట్రాల్లో వారి అధ్యక్షులను మాత్రం అగ్రవర్ణాలకు కట్టబెట్టిందన్నారు. బీసీలను తప్పించి మరీ చేజిక్కించుకున్నారన్నారు. బీసీలైన బండి సంజయ్ అధ్యక్ష పదవిని, సికింద్రాబాద్ నుంచి ఎప్పుడూ గెలుపొందే దత్తాత్రేయ నుంచి లోక్‌సభ స్థానాన్ని లాగేసుకున్నది కిషన్‌రెడ్డేనన్నారు. బీజేపీ శాసనసభాపక్షం నేత మహేశ్వర్‌రెడ్డిని కూడా కిషన్‌రెడ్డే నియమించారని సీఎం గుర్తు చేశారు. వాళ్లు పదేపదే చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఓబీసీ కాదని... నాడు ముఖ్యమంత్రి పదవిని అడ్డం పెట్టుకొని ఆయన కన్వర్ట్ అయ్యారన్నారు. 2001 వరకు అగ్రవర్ణాల్లో ఉన్న ఆయన కులాన్ని ఆయన సీఎం అయిన తర్వాత బీసీల్లో కలిపారని గుర్తు చేశారు.ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు ఉన్నా వారి సంఖ్య ఖచ్చితంగా లేకపోవడం వల్ల ఈ రిజర్వేషన్ల అంశంలో సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని...ఇప్పుడు కులగణన ద్వారా ముస్లింల సంఖ్య తేల్చడంతో ఈ లెక్కలు కోర్టుకు సమర్పిస్తే...వారికి న్యాయంగా రావాల్సిన రిజర్వేషన్ ఫలాలు అందుతాయన్నారు. తాజా లెక్కల ప్రకారం ముస్లింలలో 10.08శాతం ఓబీసీలు ఉన్నా...వారికి బీసీ-ఈ కిందఇచ్చిన 4శాతం రిజర్వేషన్ మాత్రమే వర్తిస్తుందని...అందువల్ల ఓబీసీలు భయపడాల్సిన పనిలేదని సీఎం తెలిపారు. గతంలో బీఆర్ఎస్ హయంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే మొత్తం తప్పుల తడకన్న సీఎం రేవంత్‌రెడ్డి....ఎస్సీ ఉపకులాలు 82 ఉన్నట్లు తప్పుడు లెక్కలు చెప్పారని వాస్తవంగా ఉన్నది 59 అన్నారు. ఎలాంటి తప్పులు తలెత్తకుండా శాస్త్రీయంగా సర్వే చేయడం వల్లే 50 రోజులు పట్టిందన్నారు. ఈ కులగణనకు త్వరలోనే చట్టబద్ధత తీసుకొస్తామన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన జ్యుడిషియల్ కమిషన్ ఇచ్చిన నివేదికను యథాతథంగా అమలు చేశాం తప్ప....ఇందులో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం ఏమీలేదన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచడం ఇప్పుడప్పుడే సాధ్యం కాదని...ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు మినహాయించిన తర్వాత 50 శాతం లోపు మిగిలిన రిజర్వేషన్ల ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినందున బీసీలకు ఇవ్వలేమన్నారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వాలంటే మాత్రం రాజ్యాంగ సవరణ చేయాల్సిందేనన్నారు. అందుకే మేం పార్టీ తరఫున ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పలేదని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. బీసీ కులగణనపై మండల,జిల్లా,రాష్ట్రస్థాయిలో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం అమోదం తర్వాతే కులగణన చేపట్టామన్నారు.బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌ను అరెస్ట్ చేయాలన్న తొందరేమీ తనకు లేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. వ్యవస్థలన్నీ చట్టప్రకారం తమ పని తాము చేసుకుంటూపోతాయన్నారు.

# కేటీఆర్ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... బీజేపీని మరోసారి గెలిపిస్తున్నందుకు రాహుల్ గాంధీకి అభినందనలు అంటూ ఎద్దేవా చేసిన సంగతి తెలిసిందే. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాము కాంగ్రెస్ పార్టీ సమరయోధులమని... తాము ఎప్పుడూ ఓటమిని అంగీకరించబోమని కోమటిరెడ్డి అన్నారు. తెలంగాణ మాదిరే తాము ఎప్పుడూ పుంజుకుంటామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు గిఫ్ట్ గా ఇచ్చి, మీ సొంత పార్టీకి సున్నా సీట్లను తెచ్చుకున్న మిమ్మల్ని అభినందిస్తున్నానని చెప్పారు. తెలంగాణలో బీజేపీ ఎదుగుదలకు ఎవరైనా కారకులైతే... అది ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీనే అని అన్నారు.

## ఢిల్లీ ఫలితాలు... రేవంత్, కేటీఆర్ లపై రఘునందన్ రావు తీవ్ర విమర్శలు

### ఢిల్లీ ఫలితాలు రేవంత్ రెడ్డికి గుణపాఠమన్న రఘునందన్ రావు

### ఢిల్లీ ఎన్నికలతో కేటీఆర్ కు ఏం సంబంధమని ప్రశ్న

### తెలంగాణలో బీజేపీ దమ్ము ఏంటో రాబోయే రోజుల్లో తెలుస్తుందని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పెద్ద గుణపాఠమని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ దమ్ము ఏంటో తెలుస్తుందని చెప్పారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ లోకల్ బాడీ ఎన్నికల్లో పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీకి గాడిద గుడ్డు వచ్చిందని ఎద్దేవా చేశారు.ఢిల్లీ ఎన్నికలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఏం సంబంధమని రఘునందన్ రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ మీద అంత ప్రేమ ఉంటే ఆ పార్టీలో బీఆర్ఎస్ ను విలీనం చేయాలని చెప్పారు.

కేటీఆర్ కు అంత దమ్ముంటే 76 అసెంబ్లీ, 12 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము కూడా లేనోళ్లు మాట్లాడితే తాము స్పందించాల్సిన అవసరం లేదని చెప్పారు. కేటీఆర్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మేలని అన్నారు.

## నిండా ముంచిన నలిలీ విత్తనాలు

**నల్గోండ పెన్ పవర్:** సూర్యాపేట జిల్లాలో నకిలీ వరి విత్తనాలు కొని సాగుచేసిన రైతులు నిలువునా మోసపోయారు. వరి నాట్లు వేసిన రెండు నెలలోపే వరి కంకులు బయటికి వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు. సూర్యాపేట జిల్లా పరిధిలోని చివ్వెంల, పెన్ పహాడ్, సూర్యాపేట, మోతే మాండలాల్లో పెద్ద ఎత్తున రైతులు మోసపోయారు. గ్రామాల్లో తిరిగి దిగుబడి ఎక్కువగా వస్తుందని, నకిలీ వరి విత్తనాలను రైతులకు ప్రైవేట్ కంపెనీల ఏజెంట్లు అంట కట్టినట్లు రైతులు వాపోతున్నారు. మామూలుగా నాటు వేసిన 90 రోజుల్లో వరి ఈని, వరి కంకులు బయటికి వస్తాయి.. ఈ నకిలీ విత్తనాల వల్ల 45 రోజుల్లోనే వరి కంకులు బయటికి వచ్చి మొత్తం తాలులుగా మారిపోయిందని కన్నీటి పర్యంతం అవుతున్నరు. తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నరు.

## సీఐ భార్యను విచారించిన పోలీసులు

**నల్గోండ పెన్ పవర్:** శాలిగౌరారం మండలం, ఊటుకూరులో ఉద్రిక్తత శుక్రవారం ఆర్ధరాత్రివరకు ఉద్రిక్తత నెలకింది. అబిడ్స్ లో సీఐ గా పనిచేస్తున్న కుంభం నరసింహకు, అతని తన భార్య సంధ్య కు కొంతకాలంగా కుటుంబ గొడవలు కొనసాగుతున్నాయి. తన బిడ్డను భార్య కిడ్నాప్ చేసిందని సిఐ సరూర్నగర్ పిఎస్ లో భార్యపై కేసు పెట్టాడు. పోలీసులు ఊటుకూరుకు చేరుకొని రెండు గంటలుగా భార్య సంధ్యని విచారించారు. పాప తన వద్ద ఉందని చెప్పి, పోలీసులకు చూపించినప్పటికి తనను వేధిస్తున్నారని భార్య సంధ్య ఆవేదన వ్యక్తం చేస్తోంది. తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తూ.. పిల్లలను దూరం చేస్తున్నాడని భార్య ఆరోపించింది. భార్యాభర్తల వ్యవహారంపై కోర్టులో కేసు నడుస్తుందని తెలిపింది. తన భర్త అబిడ్స్ సిఐ కుంభం నరసింహ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

## యాదాద్రిలో న్యాయమూర్తి సంజయ్ పాల్ పూజలు

**యాదాద్రి పెన్ పవర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట లోని శ్రీలక్ష్మి నరసింహ స్వామిని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా.. చీఫ్ జస్టిస్ కు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. తరువాత ఆలయ ఈవో భాస్కర్ రావు.. స్వామి వారి లడ్డుప్రసాదాన్ని న్యాయమూర్తికి అందజేశారు. అనంతరం యాదాద్రి ఆలయనీ ప్రధాన రాజ గోపురం, గోపురాలు, ముఖ మండపాలు, శిల్పకళా సంపాదనము గూర్చి ఆలయ అర్చకులు జస్టిస్ దంపతులకు వివరించారు.

## ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వండి

**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యం లో పోలింగ్ సిబ్బందిని నియమించు కోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. జీపీలు, ఎంపీపీలు, జడ్పీల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఒక్క రోజు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సూచించింది. ఇప్పటికే హైదరాబాద్ లో ఎస్ఈసీ మాస్టర్ ఆఫ్ ట్రైనర్లు, స్టేట్ రిసోర్స్ పర్సన్లకు శిక్షణ నిర్వహించింది. జిల్లాకు పది మంది చొప్పున ట్రైనర్స్ ఆఫ్ ట్రైన్సర్ టీవోటీ, లు శిక్షణకు హాజరయ్యారు వీరు జిల్లాలోని రిటర్నింగ్ అధికారులతో పాటు పంచాయతీలు, మండల ప్రజా పరిషత్లు, జిల్లా ప్రజా పరిషత్ల పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వనున్నారు. అంతేకాకుండా, ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర అధికారులు, బాధ్యులను నియమించాలని కోరింది. శిక్షణ పొందిన ట్రైనర్లతో జిల్లా, మండల, గ్రామస్థాయి పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించింది.

## ఢిల్లీలో బీజేపీ ఘన విజయం పట్ల గంగాధరలో బీజేపీ నాయకుల హర్షాతిరేకాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలో బీజేపీ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా, కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురా నగర్ చౌరస్తాలో మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై నమ్మకంతో ఢిల్లీ ప్రజలు బీజేపీకి అపూర్వ విజయాన్ని అందించారు. ఢిల్లీ అభివృద్ధి కోసం ప్రజలు బీజేపీకి మద్దతు తెలిపారు" అని పేర్కొన్నారు. అలాగే, "ఆమ్ ఆద్మీ పార్టీ లిక్కర్ స్కాంలో ఇరుక్కొని పరిపాలనను పూర్తిగా అవినీతిమయం చేసిందని తెలిపారు. దాంతో, ఢిల్లీ ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారు. ఇండియా కూటమి పేరుతో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తామని చెప్పినా, ఢిల్లీలో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఇది కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు క్షీణిస్తుందనడానికి మరో ఉదాహరణ" అని ఆయన వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ జెండా ఎగరడం



ఖాయం. ఢిల్లీలో సాధించిన ఘన విజయాన్ని మాదిరిగానే రాబోయే తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో, అలాగే కరీంనగర్ పట్టభద్రుల మరియు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని" మండల అధ్యక్షులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి దళిత మోర్చా అధికార ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్, సదాల భాస్కర్, శ్రీపతి రాజేంద్రప్రసాద్, రేండ్ల శ్రీనివాస్, ఆళ్ల విజయేందర్ రెడ్డి,

తాళ్ల రాజశేఖర్, ఆకుల మనోహర్ దయ్యాల ప్రణయ్, మల్యాల పోచయ్య, రాజు, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాగూర్ సినిమా రిపీట్

**హైదరాబాద్ పెన్ పవర్:** మియాపూర్ మాదీనగూడ లో సిద్ధార్థ న్యూరో హాస్పిటల్ లో రాగూర్ సినిమా సీన్ రిపీట్ అయింది. చనిపోయిన శవానికి సిద్ధార్థ న్యూరో హాస్పిటల్ సిబ్బంది ట్రీట్మెంట్ చేసారు. సుహాసిని (26) కళ్ళు తిరిగి పడిపోతే కడప హాస్పిటల్ నుండి ట్రీట్మెంట్ కోసం సిద్ధార్థ న్యూరో హాస్పిటల్ కి బంధువులు తీసుకువచ్చారు. కానీ నెల రోజుల నుండి పేషెంట్ కి ట్రీట్మెంట్ చేస్తున్నానని అని నమ్మబలికి 12,50,000 బిల్ కట్టించుకున్నారు. ఇంక బ్యాలెన్స్ 5లక్షలు బిల్ పే చేయండి. రోగి బతుకుతుంది అని నమ్మబలికారు. కానీ శనివారం ఉదయం బిల్ ఏం పే చేయవద్దు..తీసుకుపోయి నిమ్స్ లో జాయిన్ చేస్కోండి అని హాస్పిటల్ యాజమాన్యం చెప్పేసింది. నిమ్స్ కి తరలిస్తే రోగి చనిపోయింది అని చెప్పాడం తో మృతదేహాన్ని తిరిగి సిద్దార్థ్ హాస్పిటల్ కు బంధువులు తెచ్చారు. హాస్పిటల్ ముందు ధర్నాకు దిగారు. ..

## రీ సర్వే నిర్వహించి పద్మశాలిల లెక్కలను పక్కాగా తేల్చండి




**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వే నిర్వహించి పద్మశాలిల లెక్కలను పక్కాగా తేల్చాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షులు వీ రాజకుమార్ మాట్లాడారు. ప్రభుత్వం చూపిన తమ సామాజిక వర్గ లెక్కలు వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మొత్తం పద్మశాలీలు కేవలం 11 లక్షల మాత్రమే ఉన్నారని చెప్పడం విడ్డూరం అని మండిపడ్డారు. సుమారు 30 లక్షల పైచిలుకు పద్మశాలీల జనాభా ఉంటుందని అన్నారు. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారిని కూడా లెక్కిస్తే మరింత పెరుగుతుందన్నారు. వీటిని ప్రాతిపదికగా తీసుకుంటే రాబోవు 10 సంవత్సరాలు తమ సామాజిక వర్గానికి విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో తీరని అన్యాయం జరుగుతుందని విచారం వ్యక్తం చేశారు. తప్పుల తడకగా ఉన్న కులగలను సరి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాన్ని దేనిని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే తమ సామాజిక వర్గ ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.